క్లుప్తంగా

వృత్తి పట్ల అంకితభావం ఉండాలి



ప్రత్తిపాడు: వృత్తి పట్ల అంకితభావం ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ పీడీకేవీఏఎస్ విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా విధులు నిర్వర్తిస్తున్న వి.సుజాతాదేవి బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఆమెకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పీడీ విజయలక్ష్మి సుజాతాదేవి దంపతులను సత్కరించి మెమొంటో అందించారు. పీడీ మాట్లాడుతూ.. పనిచేసే చోట ప్రజామన్ననలు పొందాలన్నారు. వృత్తిరీత్యా అనేక మండలాల్లో విధులు నిర్వర్తించానని.. ప్రతి చోట ప్రజాప్రతినిధులు, అధికారులు, తమ కార్యాలయం సిబ్బంది తనకు ఎంతో సహకరించారని సుజాతాదేవి అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆరు ప్రాజెక్టుల సీడీపీవోలు, ఏసీడీపీవోలు, సూపర్‌వైజర్లు, ప్రత్తిపాడు ప్రాజెక్టు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రూ.1.50 లక్షల పన్ను బకాయిలు చెల్లింపు

నెహ్రూనగర్: 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్నును ఏక మొత్తంలో పన్ను చెల్లింపులు, పాత బకాయిలను చెల్లించి 50శాతం వడ్డీ రాయితీని వినియోగించుకున్న న్యాయవాది పులివర్తి శ్రీనివాస్‌ను నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అభినందించారు. బుధవారం పులివర్తి శ్రీనివాస్ తన వ్యక్తిగత ఆస్తులకు సంబంధించిన 10 అసెస్మెంట్లకు గాను రూ.1,50,000, పాత బకాయిలను చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని చెప్పారు.

క్రైస్తవుల డిమాండ్లపై సీఎం వెంటనే స్పందించాలి

నెహ్రూనగర్: క్రైస్తవులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించాలని సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు డిమాండ్ చేశారు. క్రైస్తవుల డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ వద్ద క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి విషయంలో కోట్లాది మంది క్రైస్తవులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని..వీటిని నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఆయన మృతిపై సందేహాలను నివృత్తి చేసేందుకు హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తును చేపట్టాలన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు ఎస్.ఇమ్మానుయేల్, జీవరత్నం, దివాకర్‌బాబు, ఆమోసు, నాని, నిస్సీ, ప్రేమజ్యోతిబాబు, రత్నశ్రీ పాల్గొన్నారు.

లాసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: న్యాయ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే లాసెట్–25కు ఈనెల 2వ తేదీ నుంచి ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జాగర్లమూడి చంద్రమౌళి(జేసీ) న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 25 ఏళ్లుగా ప్రవేశ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల, ఐదేళ్ల కోర్సులకు జూన్ 5న ప్రవేశ పరీక్షలు జరగనున్నాయని, వివరాలకు 0863–2350330, 98485 50353 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రధాని సభకు మెడికల్ కిట్స్

గుంటూరు మెడికల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మే 2న అమరావతి రాజధాని పునః నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న నేపథ్యంలో గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయ ఫార్మాసిస్టులు మెడికల్ కిట్స్‌ను సిద్ధం చేస్తున్నారు. రెండు రోజుల పాటు ఫార్మాసిస్టులు ఒక్కో కిట్‌లో వంద రకాల మందులు పెట్టి ప్రత్యేక సభ వద్ద మెడికల్ కిట్స్ అందుబాటులో తెచ్చేందుకు సిద్ధం చేశారు.

అమ్మవారికి కుంకుమార్చన



నగరంపాలెం: స్థానిక శారదా కాలనీ ఏడో వీధిలో కొలువైన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నాలుగో రోజుకి చేరాయి. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం కుంకుమార్చన లలితాదేవి సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో అలకరించిన రథంలో అమ్మవారిని అధిష్ఠించారు. మేళతాళాలు, వేషధారణలు, బాణసంచా కాల్చుతూ పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీత్రినాథ భజన మండలి బృందం కోలాటం నిర్వహించారు.

ఘనంగా ప్లాటినం జూబ్లీ భవన ప్రారంభోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

పెదకాకాని: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనేది పూర్వ విద్యార్థులు చేసి చూపించారని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. పెదకాకాని మండలం నంబూరు శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పూర్వ విద్యార్థులు నిర్మించిన ప్లాటినం జూబ్లీ భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈమని ప్రతాపరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హెనీక్రిస్టీనా మాట్లాడుతూ.. సంపద అందరి దగ్గర ఉన్నా.. సాయం చేసే మంచి మనసు కొందరికే ఉంటుందన్నారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో ఎదుటి వారికి, మంచి పనికి సాయం చేయడంలో సంతృప్తి ఉంటుందన్నారు. మంచి మనసుతో రూ.50 లక్షలు ఇవ్వడంతోనే పాఠశాల ఆవరణలో ప్లాటినం జూబ్లీ భవనం నిర్మించడం సాధ్యమైందన్నారు.

పూర్వ విద్యార్థుల చొరవ.. దాతల సహృదయం..

భవన నిర్మాణానికి ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులు, దాతలకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు పొందడానికి ప్రయత్నాలు చేస్తున్న ఈ రోజుల్లో మేమే ప్రభుత్వానికి రూ.50 లక్షల వ్యయంతో భవనం నిర్మించి అందజేస్తున్నామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థుల చొరవ.. దాతల సహృదయంతోనే ఇది సాధ్యమన్నారు. ప్లాటినం జూబ్లీ భవనానికి ప్రారంభోత్సవం చేసి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలలో సుదీర్ఘకాలం పనిచేయడంతో పాటు ఆ పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి రూ.6 లక్షల విరాళాన్ని అందించిన దాత తియ్యగూర అంజిరెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్ లతీఫ్, ఎంఈఓలు శంకరరాజు, సత్యన్నారాయణ, పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి నంబూరు నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు వాసా మాణిక్యాలరావు, జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం సీహెచ్ కొండయ్య, పూర్వ విద్యార్థుల సంఘం కమిటీ సభ్యులు కుర్రా కృష్ణ, ఆరదల శంకరరావు, గాడికో సర్వారెడ్డి, సలహా కమిటీ సభ్యులు నంబూరు కిషోర్, దినేష్ రెడ్డి, రాజమన్నర్, తులాబందుల తాతయ్య, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లంకపల్లి నాగరాజు పాల్గొన్నారు.



తియ్యగూర అంజిరెడ్డిని సత్కరిస్తున్న హెనీక్రిస్టినా

ఉపాధ్యాయుడికి సన్మాన కార్యక్రమం



కోటయ్య దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, అధికారులు

పొన్నూరు: ఉపాధ్యాయ వృత్తిలో మూడున్నర దశాబ్దాల పాటు అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలను పొందిన గొప్ప ఉపాధ్యాయుడు ఊరటి కోటయ్య అని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేసిన కోటయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం మామిళ్లపల్లిలో సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పి.వి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కోటయ్య అందించిన సేవలను కొనియాడారు. సామాజిక సేవలో ముందంజలో ఉండి గ్రామంలో యూపీ స్కూల్‌ను హైస్కూలుగా మార్చేందుకు తోడ్పాటు, బస్టాండ్ నిర్మాణంలో కోటయ్య కృషి అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా కోటయ్య, శైలజ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌జీటీఎస్ పూర్వ అధ్యక్షులు బోడపాటి సంభారెడ్డి, నాయకులు వి.విశ్వనాథం, దుర్గారావు, జి.ప్రభుదాస్, తాండవకృష్ణ, హనుమంత రావు, జి.రాజశేఖర్, ఎం.కలదర్, ఎంఈఓ విజయ భాస్కర్, పొన్నూరు ఎంఈఓ కె.శ్రీనివాసరెడ్డి, పి.సాంబశివరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళా బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం



మహిళా బాలల గ్రంథాలయంలో శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో బాల, బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు కథలు చెప్పడంతో పాటు చిత్రలేఖనం, యోగా, తెలుగు పద్యాలు చెప్పారు. శిక్షణ శిబిరాన్ని గ్రంథాలయాధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష పర్యవేక్షించారు.

–ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో ఉపాధ్యాయుడు షేక్ ఖయ్యూం విద్యార్థులకు సాంకేతిక విద్య–ఆవశ్యకతపై శిక్షణ కల్పించారు. గణిత ఉపాధ్యాయుడు గణితసూత్రాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు చేరిక



మాట్లాడుతున్న చెరుకూరి తిరుపతిరావు, వేదికపై బీజేపీ నేతలు, పార్టీలో చేరిన నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు సమక్షంలో మంగళగిరి పట్టణం వైఎస్సార్‌సీపీ నాయకులు మునగపాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మునగపాటి వెంకటేశ్వర్లు పార్టీలో చేరారు. వీరితోపాటు మరికొంతమంది పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ మునగపాటి వెంకటేశ్వరరావు గతంలో బీజేపీలో అనేక పదవుల్లో పని చేసిన అనుభవం ఉందన్నారు. గతంలో బీజేపీ తరుపున మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీ చేసి రెండు సార్లు గెలిచారని గుర్తు చేశారు. మునగపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బీజేపీ నా మాతృ సంస్థ అని, సంస్థలోకి మళ్లీ రావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వీవర్ సెల్ కన్వీనర్ జగ్గారపు శ్రీనివాస్ రావు, భాను కిషోర్, రవి కిరణ్, యడ్లపాటి స్వరూపారాణి, భీమినేని చంద్రశేఖర్, కొక్కెర శ్రీనివాస్ యాదవ్, నేరెళ్ల మాధవ్ రావు, చరక కుమార్ గౌడ్, వై.వి.సుబ్బారావు, పాల్గొన్నారు.

మేయర్‌ను సత్కరించిన బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: నగరపాలక సంస్థ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు, బీజేపీ సీనియర్ నాయకులు కొత్తూరు వెంకట సుబ్బారావు, మేయర్ చాంబర్‌లో కలిసి మేయర్‌ను సత్కరించారు. సత్కరించిన వారిలో నేరెళ్ల మాధవ్ రావు, చరక కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, వెలగలేటి గంగాధర్, పద్మనాభం, తోట శ్రీనివాస్, ఏలూరు లక్ష్మీ, మేరీ సరోజిని, నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, దారా అంబేడ్కర్, బజరంగ్ రామకృష్ణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, రాజేష్ నాయుడు, దేసు సత్యనారాయణ, జితేంద్ర గుప్తా, స్టాలిన్, కారంశెట్టి రమేష్, ఏసోబు పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి, అమీనాబాద్ గ్రామాల్లో బుధవారం ప్రజలకు సన్‌స్ట్రోక్ (వడదెబ్బ) తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. తీవ్రంగా ఎండలు ఉన్న సమయంలో ఎక్కువగా తిరగవద్దని చెప్పారు. మాంసాహారం తగ్గించి కూరగాయలను ఆహారంలో తీసుకోవాలన్నారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. లేత రంగులో ఉండే పలుచని దుస్తులు ధరించాలన్నారు. రోజూ కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలని చెప్పారు. ఒక వేళ వడదెబ్బ తగిలిన పక్షంలో ఆ వ్యక్తిని నీడ ఉండే ప్రదేశానికి తీసుకొచ్చి, తడిగుడ్డతో శరీరం తుడవాలని చెప్పారు. చల్లనిగాలి తగిలేలా చూసి ఉప్పు కలిపిన మజ్జిగ, లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరగవొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి చిత్రపటం బహూకరణ



చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పలువురు నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర మాజీ సివిల్ సప్‌లైస్ డైరెక్టర్ తనుబుద్ధి చంద్రశేఖర్ రెడ్డి ఆయనకు చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, రాష్ట్ర జైన్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మనోజ్ కొఠారి, రవీందర్ రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై విద్యార్థులకు శిక్షణ

ప్రత్తిపాడు: వేసవి శిక్షణ తరగతులు ఉల్లాసంగా జరుగుతున్నాయి. పత్తిపాడు శాఖ గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ అధికారి బి.అరుణ ఆధ్వర్యంలో పిల్లలకు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ కాట్ర లింగారావు విద్యార్థులతో ధ్యానం చేయించారు. శ్వాసపై ధ్యాస ఉంచి ధ్యానం చేయడం ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు వారి వయస్సు ఆధారంగా రోజుకు రెండు సార్లు ధ్యానం చేయాలని లింగారావు సూచించారు. రోజూ ధ్యాన అభ్యాసాన్ని నిబద్ధతతో అలవర్చుకోవాలిని చెప్పారు. అనంతరం పుస్తక సమీక్ష, కథలు చదివించడం, జనరల్ నాలెడ్జిపై అరుణ విద్యార్థులకు వివరించారు.

శ్రీశ్రీ జయంతి వేడుకలు

పెదకాకాని: విప్లవ రచయితల సంఘం స్థాపన అధ్యక్షునిగా శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) ప్రసిద్ధి చెందారని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గోపాల రావు అన్నారు. పెదకాకాని గ్రంథాలయంలో వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మూడో రోజు సమ్మర్ క్యాంప్ కొనసాగింది. బుధవారం విద్యార్థులతో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా శ్రీరంగం శ్రీనివాసరావు 115వ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గోపాలరావు మాట్లాడుతూ.. ప్రముఖ తెలుగు కవి, హేతువాది, నాస్తికుడు, విప్లవకవిగా అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా విప్లవ రచయితల సంఘం స్థాపన అధ్యక్షుడిగా శ్రీశ్రీ ప్రసిద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పాటిబండ్ల హనీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.55.57 కోట్ల పన్ను వసూలు

నెహ్రూ నగర్: ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ, అడ్వాన్స్ ట్యాక్స్‌పై 5 శాతం రాయితీతో పన్ను వసూలులో గుంటూరు నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ 30 తేదీ నాటికి రూ.55.57 కోట్లతో రికార్డ్ సాధించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై, అడ్వాన్స్ ట్యాక్స్‌పై రాయితీలు ప్రకటనను నగరంలో 52,680 మంది, గతేడాది కంటే 25 శాతం మంది అధికంగా సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఏప్రిల్‌లో రెవెన్యూ వసూలులో ఆస్తి పన్ను రూ.52.31 కోట్లు, ఖాళీ స్థల పన్ను రూ.3.26 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. గతేడాది 45,542 మంది రూ.44.45 కోట్లు పన్ను చెల్లించారన్నారు. గతేడాదికి మించి ఏ ఏడాది రూ.11 కోట్లు అధికంగా పన్ను వసూలు చేసిన అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులు, డెప్యూటీ కమిషనర్లు, అదనపు కమిషనర్ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నామని చెప్పారు.

రేపు ఆదిశంకరుల జయంతి వేడుకలు



మాతా శివానంద సరస్వతి

తాడేపల్లి రూరల్: పట్టణంలోని నులకపేటలో చైతన్య తపోవనంలో శుక్రవారం ఆది శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాతా శివానంద సరస్వతి తెలిపారు. బుధవారం తపోవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం చిన్నారులతో నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులందరూ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మస్తానయ్యకు సత్కారం



మస్తానయ్యను సత్కరిస్తున్న విశ్వంజీమహరాజ్, ఆధ్యాత్మికవేత్తలు తదితరులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఇటీవల కళారత్న అవార్డు స్వీకరించడంతో బుధవారం అభినంద సత్కార సభ నిర్వహించారు. సభకు ప్రముఖ వ్యాపారవేత్త మర్రెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. విశ్వయోగి విశ్వంజీమహరాజ్, ఆధ్యాత్మికవేత్తలు సముద్రాల రామానుజాచార్యులు, గుడిమెళ్ల కూర్మనాథస్వామి, ఆలయ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య హాజరై ప్రసంగించారు. ఆయన నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను వక్తలు అభినందించారు. అనంతరం మస్తానయ్యను సత్కరించారు.

చానల్ పొడిగింపునకు చర్యలు తీసుకోవాలి



నల్లమడ వాగును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కాకుమాను: నల్లమడ ఆధునీకరణ, గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పెదనందిపాడు వద్ద ఉన్న నల్లమడ వాగును బుధవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో కాలంగా నల్లమడ ఆధునీకరణ పనులు, గుంటూరు చానల్‌ను పొడిగించాలని పెదనందిపాడు ప్రాంత్ర ప్రజలు 60 ఏళ్లుగా చేస్తున్న ధర్నాలు, నిరసనలకు ప్రయోజనం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లమడ వాగులో పిచ్చి మొక్కలు, తుమ్మచెట్లు పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పరుస్తున్నాయని అన్నారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించడంతో సుమారు 60 గ్రామాలకు తాగు, 50 వేల ఎకరాలకు సాగునీటి సమస్య తీరుతుందని తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గుంటూరు చానల్ పొడిగింపునకు కావాల్సిన నిధులు మంజూరు చేయడంతో పాటు నల్లమడ ఆధునీకరణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, ముద్దన వెంకటేశ్వర్లు, పఠాన్ సలీం, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు కుటుంబ ఆశీర్వాద ప్రార్థన



ప్రార్థనా సభ వద్ద మాట్లాడుతున్న మ్యాథ్యూస్

గుంటూరు రూరల్: ప్రపంచ శాంతి కోసం, దేశంలోని ప్రతి కుటుంబం దేవునితో ఆశీర్వదించేందుకు ఏటా మే 1న నిర్వహించే కుటుంబ ఆశీర్వాద ప్రత్యేక ప్రార్థన సభను గురువారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్నట్లు కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ మ్యాథ్యూస్ తెలిపారు. బుధవారం మిర్చియార్డు సమీపంలోని మెట్టు మల్లారెడ్డి పొలంలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థన ఏర్పాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. 2008 సంవత్సరం నుంచి ఏటా మే 1న కుటుంబాల క్షేమం కోసం ప్రత్యేక సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుంటూరు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా విశ్వాసులు ఈ ఒక్కరోజు సభలో కుటుంబ సమేతంగా పాల్గొని దైవ ఆశీర్వాదములు పొందాలని ఆకాంక్షించారు. ప్రార్థనల్లో పాల్గొనే విశ్వాసులకు భోజనం, అన్ని సౌకర్యాలు, ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో బ్రదర్ హోసన్న, బ్రదర్ తిమోతి, బ్రదర్ ఎహోషువా, బ్రదర్ పౌల్, బ్రదర్ ప్రేమ్, క్రైస్తవ నాయకులు ఈరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై బుధవారం శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతులతో వేదపండితులు నారాయణ ప్రసాదాచార్యస్వామి, పరుచూరి మాధవస్వామి, పరాశరం కృష్ణకిషోర్, ముత్తేవి చిన్మయానంత శ్రీని వాసస్వామి, నల్లూరి సతీష్ స్వామి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలంకరిం చిన వేదికపై ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవమూర్తులకు అత్యంత వైభవంగా కల్యాణం చేపట్టారు. ఏవీకే సుజాత కల్యాణోత్సవానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు తిన్నలూరి శ్రీహరిబాబు బృందం భక్తి సంగీత విభావరి, తాళంభజన, కోలాటాలు, శ్రీ సాయిమంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమి నిర్వాహకులు నాట్యాచార్య డాక్టర్ కాజ వెంకటసుబ్రహ్మణ్యం శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను అలరించాయి. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనగా, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సాహితీ జగత్తులో శ్రీశ్రీ రచనలు అజరామరం



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: సాహితీ జగత్తులో శ్రీశ్రీ రచనలు అజరామరం అని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శ్రీశ్రీ జయంతి బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ల ప్రసాద్ మాట్లాడుతూ పేదల వాణిని వినిపించిన విప్లవ కవి శ్రీశ్రీ అన్నారు. శ్రీశ్రీ తెలుగులో వినూత్న కవితా ప్రయోగ శీలిగా అభ్యుదయ కవితా మార్గ ప్రవర్తకుడుగా, భావి కవితా యుగంలో, భాషలో, వస్తువులో చందస్సులో కొత్త పోకడలను సృష్టించినట్లు పేర్కొన్నారు. కవి జమదగ్ని మాట్లాడుతూ మహా ప్రస్థానం, మరోప్రపంచం, చరమరాత్రి, ఖడ్గసృష్టి, అనంతం లాంటి రచనలు శ్రీశ్రీ ప్రతిభకు, పాండిత్యానికి ప్రతీకలుగా నిలిచాయమన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం స్థాపనలో, విప్లవ రచయితల సంఘంలో శ్రీశ్రీ చురుకైన పాత్ర పోషించారన్నారు. అనంతరం శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజశేఖర్, సాయిబాబు, రామకృష్ణారెడ్డి, కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో యువకుడి బలవన్మరణం

తాడికొండ: అనారోగ్య సమస్యలతో యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన తుళ్లూరు మండలం బోరుపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గారపాటి కోటేశ్వరరావు(30) తల్లిదండ్రులు చనిపోవడంతో అక్క వరలక్ష్మి వద్ద ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ ఇసుక ర్యాంపులోని పూరిపాకలో నివసిస్తున్నారు. అనారోగ్య సమస్య ఎక్కువ కావడంతో బాధలు తాళలేక మంగళవారం పాకలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి వివాహం కాలేదు. సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు.

పర్యాటక రంగంలో మెప్మా మహిళలు

తాడేపల్లి రూరల్: పర్యాటక రంగంలో మెప్మా మహిళలకు అవకాశం కల్పించి వారిని ఆర్థికంగా అభివృద్ధి పరచి పట్టణ పేదరిక నిర్మూలన చేసే దిశగా మెప్మా చర్యలు తీసుకుంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. బుధవారం మెప్మా కార్యాలయంలో సమావేశమైన అధికారులు మహిళలకు ఉపాధి అంశాలపై చర్చించారు. స్వయం సహాయక బృందాల సభ్యులు టూర్ గైడ్, హౌస్ కీపింగ్, నిర్వహణ, తృప్తి క్యాంటీన్స్, హోమ్ స్టే, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, మహిళా మార్ట్, ఫుడ్ ట్రక్, గెస్ట్ హౌస్ కేర్ టేకేర్, ఫ్రంట్ ఆఫీస్ మేనేజ్మెంట్, ఫుడ్ అండ్ బేవరేజి, సర్వీసెస్, స్ట్రీట్ ఫుడ్ వెండర్, నాచరిలిస్ట్, వెహికల్ పార్కింగ్ నిర్వహణలపై మెప్మా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు లజ్వతినాయుడు, రాజ్యలక్ష్మి, పద్మారాణి, ఎస్.వెంకటేశ్వరరావు, టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.